## క్లుప్తంగా

### విద్యుత్ ఉండని ప్రాంతాలు

**తుర్కయంజాల్:** ఇంజాపూర్ సబ్‌స్టేషన్ పరిధి సప్తగిరి ఫీడర్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏఈ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. సప్తగిరి కాలనీ, విశ్వామిత్ర ఎన్‌క్లేవ్, లక్ష్య స్కూల్, కొహెడ, ఉప్పరిగూడ, నారాయణ కళాశాల, వడ్డెర బస్తీ, శ్రీ చైతన్య కళాశాల, ఎంఎల్‌ఏ క్యాంప్ ఆఫీస్, అల్లూరి వెంచర్, బృందావన్ కాలనీ, కొహెడ కోల్డ్ స్టోరేజి ఏరియాల్లో అంతరాయం కలగనుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### అభివృద్ధి పనులకు రూ.1.76 కోట్లు

మార్కెట్ చైర్‌పర్సన్ గీత



**ఆమనగల్లు:** జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత తెలిపారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో 4 గ్రామ పంచాయతీ, 8 అంగన్వాడీ భవనాలకు రూ.1.76 కోట్లు కేటాయించారన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. కడ్తాల్ మండలం మక్త మాదారం, ఆమనగల్లు మండలం చెన్నంపల్లి, తలకొండపల్లి మండలం దేవుని పడకల్, మాడ్గుల మండలం జయరాంతండా గ్రామపంచాయతీలకు జీపీ భవనాలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఈజీఎస్ ద్వారా ఒక్కో భవన నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున కేటాయించినట్లు వెల్లడించారు. నల్లవారిపల్లి, అందుగుల, మంగళపల్లి, చెన్నకేశవ కాలనీ, తలకొండపల్లి, రాంపూర్, గోవిందాయిపల్లి, నార్లకుంటా తండాలలో అంగన్వాడీ కేంద్రాలకు భవనాలు మంజూరయ్యాయని, ఒక్కో భవనానికి రూ.12 లక్షల చొప్పున కేటాయించినట్లు వివరించారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

**కడ్తాల్:** మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఉద్యోగి కడారి శివరాజ(68) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శివరాజ మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

### భూగర్భ డ్రైనేజీల్లో పూడికతీత



డ్రైనేజీలో పూడికతీత పనులు చేయిస్తున్న కమిషనర్ జ్ఞానేశ్వర్

**మీర్‌పేట:** వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని కాలనీలు, బస్తీల్లోని భూగర్భ డ్రైనేజీల్లో ముందస్తుగా పూడికతీత పనులు చేపడుతున్నామని కమిషనర్ జ్ఞానేశ్వర్ అన్నారు. మున్సిపాలిటీల్లో వంద రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం కార్పొరేషన్ పరిధి 05, 40 వార్డులలో గల్పర్ వాహనంతో డ్రైనేజీల్లోని చెత్తను తొలగించే పనులు చేపట్టారు. అనంతరం కమిషనర్ కాలనీవాసులకు హోం కంపోస్ట్ తయారీపై అవగాహన కల్పించారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, పర్యావరణ ఇంజినీర్ రాము, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

### వీధి కుక్కల పట్టివేత

**తుక్కుగూడ:** వీధి కుక్కల నియంత్రణ కొనసాగుతుందని మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి తెలిపారు. సోమవారం మున్సిపల్ పరిధి దేవేందర్‌నగర్ కాలనీలో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 8వ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కాలనీలోని పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. వీధులు, నాలాలు క్లీన్ చేయడంతో పాటు ప్రజలకు సంపూర్ణ పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తడి, పొడి చెత్తను వేరుచేసి, చెత్త సేకరణకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అప్పగించాలని ప్రజలకు సూచించారు. 9,10వ వార్డుల్లో వీధి కుక్కలను పట్టుకున్నామని, ఎవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు. ప్రజలందరూ స్వచ్ఛతలో భాగస్వాములు కావాలని కోరారు. సీనియర్ అసిస్టెంట్ స్ఫూర్తి, ప్రశాంత్ ఉన్నారు.

# కాంగ్రెస్‌తోనే కల సాకారం

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- కాంగ్రెస్ నాయకులు
- ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల అందజేత
- నిర్మాణ పనులు ప్రారంభం



మాడ్గుల: ఇర్విన్ గ్రామంలో ఇంటి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

**ఆమనగల్లు/కడ్తాల్/మాడ్గుల:** నిరుపేదల సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో సోమవారం నాయకులు, అధికారులతో కలిసి ఆయన పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. అర్హులు ఎవరూ ఆందోళన చెందవద్దని, విడతల వారీగా అందరికీ ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇస్తుందని తెలిపారు. మొదటి విడతలో స్థలం ఉండి, ఇల్లులేని బీసీలకు రూ.5 లక్షలు, ఎస్సీ,ఎస్టీలకు రూ.6 లక్షలతో ఇంటి నిర్మాణానికి విడతలుగా నిధులు మంజూరు అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అల్లాజీ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోసురవి, సేవాదళ్ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, నాయకులు సత్యంయాదవ్, మంకి శ్రీను, ముత్తి కృష్ణ, భానుకిరణ్, భిక్షపతి, వెంకటరమణ, నాగరాజు, సుదర్శన్, మహేశ్, శ్రీకాంత్, రాములు, నర్సింహ, రమేశ్, యాదయ్య తదితరులు ఉన్నారు.

**ఆమనగల్లులో..**

అర్హులైన వారందరికీ ప్రభుత్వం పక్కా ఇళ్లు మంజూరు చేస్తుందని ఇందిరమ్మ కమిటీ సభ్యులు అన్నారు. సోమవారం ఆమనగల్లు పట్టణం 11వ వార్డు ఆదర్శనగర్ కాలనీలో వారు ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. నిబంధనలకు అనుగుణంగా ఇంటిని నిర్మించుకొని, సకాలంలో నిధులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అలీం, నాజర్, ఫరీద్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

**మాడ్గులలో..**

అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తుందని యూత్ కాంగ్రెస్ కల్వకుర్తి నియోకవర్గ అధ్యక్షుడు దళపతి గౌడ్ అన్నారు. సోమవారం ఆయన మండల పరిధి ఇర్విన్ గ్రామంలో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ గౌడ్, శివ, శంకర్, యాదయ్య, శ్రీశైలం, కొండయ్య, సయ్యద్ మీర్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్‌లో..



ఆమనగల్లులో..

## సామాజిక న్యాయం.. కాంగ్రెస్‌తో సాధ్యం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

**ఆమనగల్లు:** కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నగరంలోని తన నివాసంలో ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాలకు చెందిన పలువురికి మంజూరు అయిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సోమవారం వారికి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రివర్గ విస్తరణలో కొత్తగా పదవులు దక్కించుకున్న వారికి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీల ఆలోచనల మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వం సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇచ్చిందని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తుందని చెప్పారు. దశాబ్దకాలంగా సొంతింటి కోసం ఎదురుచూసిన వారి కలలను సాకారం చేస్తుందన్నారు. అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బయోమెట్రిక్‌ను తొలగించాలి



ఎంపీఓ రఘుకు వినతిపత్రం అందజేస్తున్న జీపీ కార్యదర్శులు

**ఇబ్రహీంపట్నం:** బయోమెట్రిక్ విధానాన్ని తొలగించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులు కోరారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండల పంచాయతీ అధికారి రఘుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శులు రాజ్‌కుమార్, శివకుమార్, రవీందర్, మల్లేశ్, శ్రీలత, రాధ, అలివేలు, మమతలు మాట్లడారు. బయోమెట్రిక్ విధానం ప్రభుత్వ ఇతర శాఖల్లో లేదని, అది తమకు పెట్టడం సరైంది కాదని పేర్కొన్నారు. పారిశుద్ధ్య మెరుగు, వీధి దీపాలు, తాగునీటి నిర్వహణ, పైపులైన్ లీకేజీల మరమ్మతులకు ఏడాది కాలంగా సొంత డబ్బును వెచ్చిస్తున్నామని తెలిపారు. కార్యదర్శుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని, వెంటనే అభివృద్ధి పనుల నిధులు మంజూరు చేయాలని, దాంతో పాటే బయోమెట్రిక్‌ను తొలగించాలని కోరారు. దీనికి స్పందించిన పంచాయతీ అధికారి.. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారని కార్యదర్శులు పేర్కొన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌తో అల్లాడిన పాక్

- చావుదెబ్బ తిన్న దాయాది దేశం
- బీజేపీ నాయకుడు ఆచారి, మాజీ ఎంపీ బూర నర్సయ్య

**ఇబ్రహీంపట్నం:** పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ ప్రతిదాడికి దాయాది దేశం అల్లాడిపోతుందని బీసీ కమిషన్ జాతీయ మాజీ సభ్యుడు, బీజేపీ జాతీయ నాయకుడు తల్లోజి ఆచారి అన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌ను చావుదెబ్బతీసి, ప్రపంచ దేశాలకు భారత్ సత్తా ఏంటో చూపించామని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలో సోమవారం సాయంత్రం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్తాన్ టెర్రరిస్టులు పహల్గాంలో అమాయకుల ప్రాణాలను పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ప్రతిగా ప్రధాని మోదీ ఆపరేషన్ సిందూర్‌తో.. పాక్ పౌరులకు ఎలాంటి నష్టం కలగకుండా ఆ దేశంలోని 9 టెర్రరిస్టుల స్థావరాలపై దాడులు చేశారు. 86 మందిని హతమార్చి, భారత త్రివిధ దళాల శక్తిని చూపించారని తెలిపారు. ఈ ఘటనతో పాకిస్తాన్ అమెరికా శరణు కోరిందన్నారు. మోదీ లక్ష్యం టెర్రరిస్టులపైనేనన్నారు. దేశం కోసం, ధర్మం కోసం ప్రధానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

**శాంపిల్ మాత్రమే..**

దేశ రక్షణకు మనందరం సైనికుల మాదిరిగా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, పార్లమెంటు మాజీ సభ్యుడు బూర నర్సయ్యగౌడ్ పిలుపునిచ్చారు. అందుకు హిందువులంతా సంఘటితం కావాలన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్ శాంపిల్ మాత్రమే చూసిందని, మునుముందు భారత్ సత్తా ఏంటో తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు పోరెడ్డి నర్సింహ్మారెడ్డి, బోసుపల్లి ప్రతాప్, కొప్పు బాషా, పోరెడ్డి అర్జున్‌రెడ్డి, ముత్యాల భాస్కర్, నాయిని సత్యనారాయణ, రవీందర్‌రెడ్డి, మహేందర్, శ్రీశైలం, శేఖర్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, పాపాయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.




తిరంగా ర్యాలీలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ నాయకుడు ఆచారి తదితరులు

### ఉచిత వైద్య శిబిరం

**తుర్కయంజాల్:** మన్నెగూడలోని ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంలో మంగళ, బుధవారం బీఎస్ రెడ్డి నగర్ శ్రీ సాయి నేత్రాలయ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నామని ఆర్టీఓ సుభాష్ చందర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### బస్‌పాస్ చార్జీలు తగ్గించాలి

**తుర్కయంజాల్:** పెంచిన బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి పి.శివ కుమార్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, చార్జీల పెంపుతో సామాన్య ప్రజలతో పాటు, విద్యార్థుల ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ఆర్టీసీ యాజమాన్యం.. ఉచిత బస్సు పథకం వలన జరిగే నష్టాన్ని భర్తీ చేయడానికే చార్జీల భారం మోపుతుందని ఆరోపించారు. చార్జీల పెంపకంపై పునఃరాలోచించాలని కోరారు.

### రాజీ పడితే కేసుల పరిష్కారం

**ఆమనగల్లు:** రాజీ పడితే కేసులు పరిష్కారం అవుతాయని ఎస్‌ఐ వెంకటేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నచిన్న కేసులకు రోజుల తరబడి కోర్టు చుట్టూ తిరగకుండా, ఇరువర్గాలు కూర్చుని మాట్లాడుకుంటే సమస్య తీరుతుందని పేర్కొన్నారు. అందుకు ఈ నెల 14న ఆమనగల్లు పట్టణంలోని కోర్టులో నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## తక్కువ పెట్టుబడి.. ఎక్కువ దిగుబడి

- నీటి వినియోగం తగ్గించాలి
- వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీనివాస్

**యాచారం:** తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి వచ్చే విధంగా పంటలు పండించాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. యాచారం మండలం నస్దిక్‌సింగారం, మొండిగౌరెల్లి గ్రామాల్లో సోమవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక పంటల సాగుతో పాటు స్వల్పకాలంలో చేతికి వచ్చే పంటలపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. నీటి వినియోగాన్ని తగ్గించాలని, మార్కెట్లో ధరలను బట్టి సాగు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రవినాథ్, శాస్త్రవేత్తలు రాజేశ్వర్, కిరణ్‌కుమార్, సునీత, పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## వైభవంగా బీరప్ప కల్యాణం



బీరప్ప కామరాతి దేవిల కల్యాణోత్సవంలో పాల్గొన్న కుర్మలు

వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

**యాచారం:** బీరప్ప పండుగ ఘనంగా జరిగింది. మూడు రోజులుగా కొనసాగుతున్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం గ్రామంలోని దేవాలయంలో శ్రీ మల్లన్న గొల్ల కేతమ్మ దేవి కల్యాణం, బీరప్ప స్వామి కామరాతి దేవిల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుర్మ కులస్తులు, వారి బంధుమిత్రులతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. వేలాది మంది భక్తులతో తమ్మలోనిగూడ గ్రామం జనసంద్రంగా మారింది. కల్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత క్యామ మల్లేశ్, వెంకటరమణారెడ్డి, పాశ్చ బాష, కాంగ్రెస్ నేతలు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి, బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దెంది రాంరెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

## దళితుల సంబురాలు



స్వీట్లు పంపిణీ చేసుకుంటున్న దళిత నేతలు

**ఇబ్రహీంపట్నం:** గడ్డం వివేక్ వెంకటస్వామికి మంత్రివర్గ విస్తరణలో స్థానం దక్కిన సందర్భంగా ఇబ్రహీంపట్నంలో దళిత ఉద్యోగ సంఘాల నేతలు, అంబేద్కర్ సేవా సంఘం, మాల మహానాడు నాయకులు సోమవారం సంబురాలు చేసుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, బాణసంచాలు కాల్చారు. మిఠాయి పంచుకుంటూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ జగన్, దళిత ఉద్యోగ సంఘం నాయకులు కరుణాకర్‌లు మాట్లాడుతూ.. దళితుల అభ్యున్నతికి నిరంతరం పోరాడుతున్న నాయకుడు వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వడంతో సామాజిక న్యాయం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రజలకు ఆయన మరింత సేవ చేసేందుకు అవకాశం కల్పించిన కాంగ్రెస్ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు నర్సింగ్‌రావు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బండి మహేశ్, ఉద్యోగస్తులు కరుణాకర్, రవి, శ్రవణ్, ఆనంద్, కిరణ్, కాంగ్రెస్ నాయకులు లక్ష్మయ్య, మురళీకృష్ణ పాల్గొన్నారు.

## పార్కుల సుందరీకరణకు వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

**బడంగ్‌పేట్:** కార్పొరేషన్ పరిధిలోని 24వ డివిజన్ పార్కు స్థలాలను సుందరీకరణ చేయాలని కోరుతూ సోమవారం మాజీ కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి ఆధ్వర్యంలో విశాఖనగర్ ఫేస్–2 కాలనీ వాసులు కమిషనర్ పి.సరస్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విశాఖనగర్ కాలనీలో సర్వే నంబర్ 128లో 1800 గజాల పార్కు స్థలం ఉందని తెలిపారు. అందులో నీడనిచ్చే చెట్లు, పచ్చిక బయళ్లు, చిన్నారులు ఆడుకునేలా ఆటవస్తువులు ఏర్పాటు చేయాలన్నారు. పార్కులు లేక చిన్నారులు సెల్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోతున్నారని పుర్కొన్నారు. ఇంట్లోనే ఉంటున్న పెద్దలు, మహిళలకు కొద్దిసేపు అలా సేదతీరేందుకు పార్కులను అభివృద్ధి చేయాలని విన్నవించారు. ఇందులో విశాఖనగర్ ఫేస్–2 కాలనీ అధ్యక్షుడు రాజేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## భూ భారతితో శాశ్వత పరిష్కారం



కడ్తాల్: తహసీల్దార్‌కు దరఖాస్తులు అందజేస్తున్న రైతులు

- రైతు సదస్సులను వినియోగించుకోండి
- తహసీల్దార్లు లలిత, షేక్ ముంతాజ్

**ఆమనగల్లు/ కడ్తాల్:** రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడానికి ప్రభుత్వం భూ భారతి 2025 చట్టం తెచ్చిందని ఆమనగల్లు తహసీల్దార్ లలిత అన్నారు. అందులో భాగంగా ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తెలిపారు. పట్టణంలోని రైతువేదిక భవనంలో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొత్త చట్టంతో రైతులకు మేలు జరుగుతుందని, భూమి హక్కులు పరిరక్షించబడతాయని పేర్కొన్నారు. భూ సమస్యలు ఉన్నవారు సదస్సులను వినియోగించుకోవాలని సూచించారు. సదస్సులో పలు సమస్యలపై 55 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ చెప్పారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, డీటీ సంపత్‌కుమార్, స్థానిక నాయకులు అలీం, ఖాదర్, రామకృష్ణ, కరీం, నాజర్, ఫరీద్, నరేందర్‌నాయక్ పాల్గొన్నారు.



ఆమనగల్లు: తహసీల్దార్ లలితకు వినతిపత్రం అందజేస్తున్న మార్కెట్ డైరెక్టర్ శ్రీశైలం

**కడ్తాల్‌లో..**

రైతుల భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం భూ భారతి చట్టం తెచ్చిందని తహసీల్దార్ షేక్ ముంతాజ్ అన్నారు. సోమవారం కడ్తాల్ మండలం నాగిరెడ్డిగూడ, చరికొండ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రైతులు ఈ సదస్సులను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆదిత్యరాజు, ఆర్ఐ రాజేందర్‌రెడ్డి, నాయకులు మహేశ్, రాములుగౌడ్ తదితరులు ఉన్నారు.

### ఆ భూమినే నమ్ముకున్నాం.. పట్టాలు ఇప్పించండి

**మంచాల:** పూర్వికుల నుంచి వారసత్వంగా సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూమికి పట్టాపాసు పుస్తకాలు ఇప్పించాలని రైతులు కోరారు. సోమవారం మంచాల మండలం ఎల్లమ్మతండాలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో.. తండా రైతులు తహసీల్దార్ వెంకట ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గ్రామంలోని 204 సర్వే నంబర్‌లో 510 ఎకరాలు అసైన్డ్ భూమి ఉందని పేర్కొన్నారు. ఈ భూమిని నమ్ముకొని 75 సంవత్సరాలుగా 150 మంది రైతులం సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని తెలిపారు. గతంలో పట్టా పాసు పుస్తకాలు ఇవ్వగా, వాటిపై పంట రుణాలు తీసుకున్నామని చెప్పారు. ధరణి రావడంతో తమకు పట్టా పాసు పుస్తకాలు ఇవ్వలేదని వాపోయారు. ఇదే విషయమై పలుమార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. వాస్తవాలను పరిశీలించి, భూ భారతి చట్టం ద్వారా పట్టా పాసు పుస్తకాలు ఇప్పించాలని కోరారు. ఇదిలా ఉండా.. తండా సదస్సులో 132, లింగంపల్లి గ్రామంలో 74 దరఖాస్తులు అందాయని రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండమోని జయమ్మ, మల్లేశ్ ముదిరాజ్, శ్రీధర్, సీపీఎం నాయకులు చందు నాయక్, జగదీశ్వర్, వెంకటేశ్, ఆర్ఐలు రమేష్, శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, యాట భాస్కర్, బోద్రమోని శ్రీనివాస్, మెరుగు నాగరాజ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ వెంకట ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు